క్లుప్తంగా

గ్రామాల్లో 'ఎక్సైజ్' దాడులు



సంగెం : మండలంలోని వీఆర్ఎన్‌తండా, పల్లారుగూడ, చింతలపల్లి పరిసరాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 900 లీటర్ల బెల్లం పానకాన్ని, సామగ్రిని ధ్వంసం చేసినట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. రెండు కేసులు నమోదు చేసినట్టు ఆమె వివరించారు. దాడుల్లో ఆ శాఖ ఎస్సైలు సరిత, బి.శిరీషరెడ్డి, కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు, సురేశ్, వెంకన్న, అనిల్, వంశీ, మానస, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సంగెం రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రమేశ్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, నాయకులు సంకటి శ్రీనివాస్ గౌడ్, కందికొండ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



నర్సంపేట : మాదిగ జేఏసీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, కార్యదర్శి తీగల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండలంలోని పాతముగ్దుంపురం గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మాదాసి రమేశ్, ఉపాధ్యక్షులుగా చుంచు రాజశేఖర్, సుంకరి రాంప్రసాద్, మాదాసి దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కార్యదర్శిగా ఇటికాల రమేశ్, సహాయ కార్యదర్శిగా పరికి రమేశ్, సహాయ కార్యదర్శిగా పరికి నవీన్, కోశాధికారిగా గద్దల ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు వారికి యాదగిరి, శ్రీనివాస్, అశోక్‌కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి శ్రీనివాస్, సుంకరి కార్తీక్, మాదాసి అభి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 21వ వార్డుకు చెందిన కొయ్యడి విజయలక్ష్మి సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, నాయకులు మెరుగు సాంబయ్య, గాజుల రమేశ్, నాడెం నాగేశ్వర్,, నాగ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంగెం : మండలంలోని మొండ్రాయి గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి కొమురమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా మృతురాలి కుమారుడైన బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పురుషోత్తంను కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు మైనాల నరేశ్ సోమవారం పరామర్శించారు. తొలుత కొమురమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట అధ్యక్షుడు చిర్ర సుమన్ గౌడ్, నాయకులు గువ్వ రాజేశ్, పోశాల ప్రవీణ్, ఐలోని అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి రిమాండ్

దామెర : దాడి చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై కొంక అశోక్ తెలిపిన ప్రకారం.. ఈనెల 1న ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన దయ్యాల మనీశ్‌పై మండలంలోని ఊరుగొండ ఈద్గా వద్ద ఊరుగొండ గ్రామానికి చెందిన పాలెపాక ప్రభుకిరణ్‌తో పాటు మరో ఇద్దరు దాడిచేసి అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్లు, మూడు తులాల వెండి చైన్‌తో పాటు రూ.700 నగదు అపహరించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడైన ప్రభుకిరణ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కాగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

పథకాలకు పట్టణ పేదలు దూరం

- 'ఉపాధి', ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నోచుకోని దుస్థితి
- మున్సిపాలిటీగా ఉన్నతీకరణతోనే..

వర్ధన్నపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు పట్టణ పేదలు దూరం కావడంపై సర్వత్రా పేదల్లో ఆందోళన నెలకొంటోంది. 2018 ఆగస్టు 2న వర్ధన్నపేట, డీసీ తండా గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా మారడంతోనే ఇబ్బందుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ విలీన తండాలు, పల్లెల్లో వేలాది మంది పేదలు ఉపాధి హామీ పనులు లేక వలస బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ కూలీలు మాత్రమే అర్హులని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడంతో మున్సిపాలిటీ పరిధిలోని కూలీలు ఆ పథకానికి దూరమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండా, వర్ధన్నపేట, కొనాపురంలో 95 శ్రమశక్తి సంఘాల్లో 2500 మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటుతో పేదలకు ఉపాధి పనులు లేకుండా పోయాయి. దీంతో వర్ధన్నపేట, డీసీ తండా, గుబ్బెటి తండా, బోటి తండా, బండ తండా, భావనికుంటతండా, టీకె తండా, కోనా పురం నుంచి రోజూ వేలాది మంది పేదలు వరంగల్ నగరంలో భవన నిర్మాణ కార్మికులుగా, దినసరి కూలీలుగా లేబర్ అడ్డాలపై పనుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి చోటు చేసుకుంది. గతంలో పనుల కోసం ఇతర గ్రామాలకు ఆటోల్లో వెళ్తున్న క్రమంలో పట్టణానికి చెందిన కూలీలు రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలైన విషయం తెలిసిందే. పలువురు వికలాంగులుగా మారగా వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. స్వగ్రామాల్లోనే పనులు కల్పించేలా చేపట్టిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లేకుండా పోవడంతో పట్టణ పేదల వేదన అరణ్యరోదనగా మారింది.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు (ఫైల్)

మున్సిపాలిటీగా ఉన్నతీకరణతోనే..



వర్ధన్నపేట గ్రామ పంచాయతీగా ఉన్నపుడు వ్యవసాయ పనులు లేని సమయాల్లో ఉపాధి హామీ పనులతో ఉపాధి లభించేది. మున్సిపాలిటీగా ఉన్నతీకరించిన తర్వాత పనులు లేక ఉపాధికి దూరమై కుటుంబాలతో పస్తులుండాల్సి వస్తోంది. ఇంటి పన్నుల భారం సైతం భారీగా పెరిగింది.

– చంద్రమౌళి, కార్మికుడు

ఇందిరమ్మ భరోసాకు దూరం



పట్టణమనే కారణంతో పేదలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హతను కోల్పోతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాన్ని పేదలకు దూరం చేయడం సరికాదు. మున్సిపాలిటీగా ఉన్నతీకరించడం వల్ల పేదలు ఉపాధి పనులకు నోచుకోక ఆర్థికంగా నష్టపోయి వేదనకు గురౌతున్నారు. ఉపాధి హామీ పనులు కల్పించాలి.

– సమ్మయ్య, కూలీ

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

నర్సంపేట : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వైద్య సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ ఆదేశించారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి రికార్డులతో పాటు వ్యాక్సిన్ నిలువ ఉంచే గదిని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏఎన్‌సీ టార్గెట్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. చిన్న పిల్లలకు సమయం మేరకు టీకాలు వేయించాలని చెప్పారు. వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత పెరిగిన క్రమంలో సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంఓ జయరాజు, సీహెచ్‌ఓ భద్రయ్య, హెచ్ఈఓ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సహజ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ సామాజిక బాధ్యత



రాయపర్తి : ప్రతిజ్ఞ చేస్తున్న హామ్యానాయక్, నాయకులు

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్

రాయపర్తి : భారత రాజ్యాంగ పరిరక్షణను సామాజిక బాధ్యతగా తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అభివర్ణించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బురహాన్‌పల్లి మీదుగా కొండూరు గ్రామంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు వీరారెడ్డి, గిరగాని రాజు, కృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, కందికట్ల రాజయ్య, ఉస్మాన్, పాల్వంచ కోటేశ్వర్, కుంట రమేశ్, మురళి, యాకూబ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని 4, 5, 6వ డివిజన్ల పరిధిలోని తాళ్లకుంటతండా, భావనికుంట తండా, నీలగిరిస్వామి తండా, డీసీ తండా, గుబ్బెటితండా, దుబ్బతండాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైస సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో కార్యక్రమ ఇన్‌చార్జ్ జనగాం రమేశ్ గౌడ్ మాట్లాడారు. రాజ్యాంగ విలువలను, స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, తూళ్ల రవి, పోశాల వెంకన్న, సమ్మెట సుధీర్, సిలివేరు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కుంటపల్లిలో నిర్వహించిన పాదయాతలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీకి రూ 10 లక్షలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, తదితరాలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ యాకూబ్, నాయకులు రమేశ్, కేశవులు, నాగరాజు, నర్సింహ, హరిబాబు, జగన్నాథచారి, కిశోర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని అనంతారంలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించే పేరుతో నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కూసం రమేశ్, వీరాటి రవీందర్‌రెడ్డి, పత్తిపాక రవీందర్, జక్కుల సరిత, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ట్విన్నింగ్'తో ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీదేవి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

- టీఎంఎస్‌జేసీ ప్రిన్సిపాల్ శ్రీదేవి

పర్వతగిరి : ట్విన్నింగ్ కార్యక్రమంతో ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలలు బలోపేతం అవుతాయని తెలంగాణ మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీ (టీఎంఎస్‌జేసీ) ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆ స్కూల్/కాలేజీలో మంగళవారం నిర్వహించిన ట్విన్నింగ్, 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటలు, ఇతర అంశాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. తొలుత హర్యానా, తెలంగాణ సంస్కృతి విశేషాలను వివరించారు. అనంతరం గైడ్ టీచర్ కల్పన సారథ్యంలో విద్యార్థులు హర్యానా రాష్ట్ర, తెలంగాణ జానపద నృత్యం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే హర్యానా, తెలంగాణ వంటకాలను ప్రదర్శించారు. ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలతో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సంబంధిత పాఠశాలల విద్యార్థులు పరిసరాలతోపాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ ల్యాబ్‌లను, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కూల్ లైబ్రరీని వృత్తి విద్యకు సంబంధించిన అప్పారెల్, కంప్యూటర్ ల్యాబ్‌లను సందర్శించి అధ్యయనం చేశారు. మౌలిక వసతులు, బోధనా పద్ధతులు పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వెంకటరమణరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో...

మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బూరుగుమళ్ల, అన్నారం, దౌలత్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలతో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాక రమేశ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ లింగారెడ్డి మాట్లాడారు. ట్విన్నింగ్ ప్రోగ్రాం నిర్వహణకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి వచ్చే ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు మడత శ్రీనివాస్, సోమేశ్వర్, మదిలిమాయే తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులోని చింతగడ్డతండాలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని తండా పెద్ద మనిషి రవి, మాజీ వార్డు సభ్యుడు వినోద్ కోరారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో తండావాసులు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవి, వినోద్ మాట్లాడారు. చింతగడ్డతండాకు వెళ్లే మట్టి రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారుతోందని చెప్పారు. కుంట వద్ద కల్వర్టు ఏర్పాటు చేసి తారు రోడ్డు వేయించాల్సి ఉందన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, తండా రోడ్డు పక్కనే సైడ్ డ్రైనేజీల, వాటర్ సమస్య పరిష్కరించాలని, బోర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో తండావాసులు శ్రీను, రాము, వీరన్న, కొమ్మాలు, సంతోశ్, కల్యాణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అబాకస్ నేషనల్ జూనియర్స్ లెవల్–1లో అంజుప్రియ, స్టార్ జూనియర్ లెవల్ విభాగంలో జె.తనస్వి, ఆన్‌లైన్ పోటీలో అర్జున్ మహాదేవ్ ప్రతిభ చాటారు. అలాగే లెవల్–2 కాంపిటీషన్ స్టార్ జూనియర్స్ విభాగంలో శాన్వి శేఖర్ గోల్డ్ వైభవ్, మహాదేవ్, దైవిక్ సిల్వర్ మెడల్స్ సాధించారు. జూనియర్స్ విభాగంలో లెహంక్, ఖాజా గోల్డ్, అభినవ్, శౌశిక్ రాజ్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. సీనియర్స్ విభాగంలో ధనశ్రీ గోల్డ్, అభినవ్ సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటి మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి వనజరెడ్డి స్కూల్ ఆవరణలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ భవాని, సీఎఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నర్సంపేట : పోరాటాలతోనే గుడిసెవాసుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య స్పష్టం చేశారు. చెన్నారావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. చెన్నారావుపేటలోని నంబర్ వన్ కాలనీ, ఖాదర్‌పేట, జోజిపేట, నారాయణతండా గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు సంబంధించి అర్హులకు పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. సుమారు 50 ఏళ్లుగా రైతులు భూమిపై కాస్తు చేసుకుంటున్నా పట్టాదారు పాస్‌బుక్కులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టా పాస్‌బుక్కులు లేకపోవడంతో పేద రైతులు రైతు బంధు, రైతు భరోసా, రుణమాఫీ, పంట రుణాలకు నోచుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. 1971లో నాటి ప్రభుత్వం రైతులకు బావులు తవ్వించి ఎడ్లబండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం 1991, 2001, 2005లో సదరు భూములు అసైన్డ్ చేయబడ్డాయని తెలిపారు. తర్వాత లావాని పట్టాగానే మిగిలిపోయాయని వివరించారు. లింగగిరిలో పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు, కొరబోయిన కుమారస్వామి, ఏరియా కమిటీ కార్యదర్శి నమిండ్ల స్వామి, పరికి మధుకర్, నాయకులు జన్ను రమేశ్, బిల్లా భూపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అబ్బుదాసి అశోక్, చేనురు యాకయ్య, రాజు, మొర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

- ఎస్సై రఘుపతి



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని ఎస్సై రఘుపతి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ద్విచక్ర వాహనదార్లు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధను పాటించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది వీరస్వామి, సీతారామరాజు, రమేశ్, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను మూసేయాలి

సంగెం : మండలంలోని గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్ షాపులను మూసేయాలని, తదితర డిమాండ్లతో ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని చెప్పారు. కొన్ని కిరాణా షాపుల్లో ప్రభుత్వ నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. బెల్ట్‌షాపుల మూసివేత, మత్తు పదార్థాల విక్రయాలను నిరోధించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు గోనె రాంచందర్, డి.రాజు, శ్రీనివాస్, జక్క అశోక్, వెంకన్న తదితరులున్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోండి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమ

నర్సంపేట రూరల్ : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ కోరారు. నర్సంపేటలోని సర్వాపురం–2 సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు గర్భం ధరించినప్పటి నుంచి రెండేళ్లపాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సరైన పోషణతోనే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వగలరని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే రక్తహీనత బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, కొమ్మురమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈఓ రాము



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ రాము తెలిపారు. మండలంలోని లోహిత పెద్ద తండా పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులతో ప్రదర్శింపజేసిన తెలుగు, ఆంగ్లం, గణిత సామర్థ్యాలను ఎంఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయుడు ఏకాంబరం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనిత, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దామెర : యువతి అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. పరకాలకు చెందిన యువతి దామెరలోని తన చిన్నమ్మ ఇంట్లో ఉంటున్న క్రమంలో మంగళవారం దుకాణానికి వెళుతున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీల పేరుతో విద్యా సంవత్సరం ప్రారంభంలో స్కూళ్లకు స్వీపర్లను నియమించుకుందని చెప్పారు. నాటి నుంచి ఇప్పటివరకు 9 నెలలు గడచినా వేతనాలు చెల్లించలేదని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.3–12 వేల వరకు వేతనాలు ఇస్తామని చెప్పి విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కేవలం రూ.3 వేల చొప్పున చెల్లిస్తామని అధికారులు అంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. స్వీపర్లు వేదనకు గురౌతున్నారని తెలిపారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి జీఓ ప్రకారం వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, వర్కర్లు గౌరై విజయ, రమాదేవి, లక్ష్మి, ఖతాజీ మౌనిక, విజయ, సుజాత, పూజిత, బేతం రేణుక, బేబీ, ఎల్లమ్మ, కనకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ భూమిలో మొరం దందా'



నెక్కొండ : తమకు చెందిన ప్రైవేట్ భూమిలో అప్పల్‌రావుపేటకు చెందిన ముత్తినేని రాజు, అతని సోదరుడు భద్రయ్య మొరం దందాకు పాల్పడుతున్నారని మండలంలోని సాయిరెడ్డిపల్లికి చెందిన చెన్నమల్ల కృష్ణకుమారి ఆరోపించారు. ఆమె తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సర్వే నంబర్ 476/1లోని తమ సొంత భూమిలో అక్రమంగా మొరం దందాకు పాల్పడుతుండగా ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా మళ్లీ ఈనెల 7న రాజు, భద్రయ్య మొరం తవ్వకాలు చేపట్టారని తెలిపారు. తమ భూమిలో అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.